క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి

పి.గన్నవరం: అమలాపురం నుంచి ముంగండ, నరేంద్రపురం, అవిడి గ్రామాల మీదుగా రాజమహేంద్రవరం వరకూ ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు దరఖాస్తు చేశారు. పదేళ్ల నుంచి ఉన్న సర్వీసును అమలాపురం నుంచి పి.గన్నవరం వరకూ రోడ్డు అభివృద్ధి పనుల నిమిత్తం నిలిపివేశారన్నారు. రోడ్డు పనులు పూర్తయిన సందర్భంగా ఈ సర్వీసులను యథావిధిగా నడపాలని కోరారు. స్కూల్, కళాశాలల విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం రెండు బస్సులైనా ఏర్పాటు చేయాలని అన్నారు.

వైభవంగా పంచామృతాభిషేకం

మలికిపురం: స్థానిక ఎత్తు వంతెన వద్ద హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం స్వామివారికి పల్లకీ సేవ జరిగింది. ఆలయం వద్ద స్థలం కొనుగోలు చేశామని, అందులో భవనం నిర్మించి నిత్యాన్నదానం ప్రారంభిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. దీనికి దాతలు సహకరించాలని కోరింది.

యోగాతో ఒత్తిడి దూరం

కొత్తపేట: గర్భిణులు ఒత్తిడికి గురికాకుండా కొన్ని యోగాసనాలు దోహదపడతాయని ప్రముఖ గైనకాలజిస్ట్ వి.ప్రదీప్తికరుణ అన్నారు. స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక భాస్కర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో గర్భిణులకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్తికరుణ మాట్లాడుతూ గర్భిణులు తమకు వీలుగా ఉండేలా యోగా చేయాలన్నారు. పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మెంటే ఉదయ భాస్కరరావు, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నీరు తరలింపు పనులు ప్రారంభం

సఖినేటిపల్లి: అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో ముంపు నీరు సముద్రంలోకి లిఫ్ట్ చేసే పనులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం అంతర్వేది సెయింట్ మేరీ స్కూల్ వద్ద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో ముంపునీటి సమస్య వల్ల కొబ్బరి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముంపు నీటిని సముద్రంలోకి లిఫ్ట్ చేయడం ద్వారా చాలా వరకూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సర్పంచ్ పోతురాజు నరసింహారావు, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత మోహనరావుకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌కు చెందిన నీరెళ్ల జగన్‌మోహన్‌రావు రూ.10,116, అయినవిల్లి మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన సలాది శ్రీరామకృష్ణ, కనకదుర్గ దంపతులు రూ.10,116 విరాళంగా సమర్పించారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు. ఆలయ అర్చక, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా రావులమ్మ జాతర

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం గ్రామ దేవత రావులమ్మ జాతర మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. గరగ నృత్యాలు, వివిధ వేషధారణలు, గారడీ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారికి వరి పిండితో చలివిడి, వడపప్పు, బెల్లం పానకం నైవేద్యంగా చెల్లించారు. కానుకలు, మొక్కుబడులు సమర్పించారు. గ్రామ ఆడపడుచులు, బంధువులతో కళకళలాడింది. గురువారం తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉద్యోగులకు సన్మానం



డీఈఈ నాగేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

పి.గన్నవరం: స్థానిక ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో నాగేంద్రకుమార్ డీఈఈగా పని చేస్తూ గుడివాడ డ్రైన్స్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. తాటిపాక సెక్షన్ ఇరిగేషన్ ఏఈఈగా పని చేస్తున్న సుందర్‌సింగ్ కోటిపల్లి ఇరిగేషన్ సెక్షన్ ఆఫీస్‌కు వెళ్తున్నారు. వీరితో పాటు పి.గన్నవరం సెక్షన్ హెడ్ గుమస్తా బాబ్జీ ధవళేశ్వరానికి బదిలీ అయ్యారు. వీరిని బుధవారం పి.గన్నవరం కార్యాలయంలో జరిగిన సమావేశంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. రాజోలు డ్రైన్స్ డీఈఈ నాగార్జున పి.గన్నవరం అడిషనల్ బాధ్యతలు చేపట్టారు. అతనికి స్వాగతం పలికారు. నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరద.. వణికిస్తున్న ఆపద

- కలవరపెడుతున్న ఏటిగట్టు
- రక్షణ పనులు అత్యవసరం



పాశర్లపూడిబాడవలో బలహీనంగా ఉన్న ఏటిగట్టు

మామిడికుదురు: వరదల సీజన్ వచ్చేస్తుంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో గోదావరి నదీ ఎగువ ప్రాంతాల్లో ఇప్పటికే పలుచోట్ల భారీ వానలు పడుతున్నాయి. దీంతో తీర గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కరకట్టలు బలహీనంగా మారడంతో తీర గ్రామాలతో పాటు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల ప్రజలు సైతం ఆందోళన చెందుతురు. పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి గోగన్నమఠం వరకూ వైనతేయ కుడి కరకట్ట పలుచోట్ల బలహీనంగా ఉంది. గోదావరికి భారీ వరదలు వచ్చిన సందర్భంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అలజడి నెలకొంటోంది. వరద నీరు ఏటిగట్టు ఎగువ ప్రాంతాలకు లీకవడంతో పాటు గట్టు పొర్లి నీరు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి సమయాల్లో ఇసుక బస్తాలతో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం తప్ప చాలాకాలం నుంచి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది అయినా గోదావరి వరదల సమయంలో ఆ పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఏటిగట్టు.. కుంగినట్టు

పాశర్లపూడిలంక, పాశర్లపూడిబాడవ అదే గ్రామంలోని తుమ్మావారి ఏరియా, పెదపట్నం అగ్రహారం కనకదుర్గ ఆలయం, మానేపల్లి గ్రామంలో ఏటిగట్టు బలహీనంగా ఉంది. 2022 గోదావరి వరదల సమయంలో పైన పేర్కొన్న ప్రాంతాల్లో ఏటిగట్టుపై నుంచి వరద నీరు పొర్లడంతో స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అక్కడ అప్పట్లో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం తప్ప పక్కాగా ఇంత వరకూ ఏవిధమైన పటిష్ట పనులు చేయలేదు. ఈ మూడు నెలలు వరదల సీజన్ కావడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి నుంచి బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటా ఆందోళనే



బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ఏటా ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కరకట్టలను బలోపేతం చేశారు. మళ్లీ అప్పటి నుంచి ఇప్పటి వరకూ వాటి ఆలనా పాలనా పట్టించుకునేవారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీర గ్రామాల ప్రజలతో పాటు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల వారు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి.

– కట్టా రామకృష్ణ, పాశర్లపూడి

బలహీనంగా ఏటిగట్టు



పాశర్లపూడిలో ఏటిగట్టు చాలా బలహీనంగా ఉంది. ఇక్కడ చాలా పల్లంగా ఉండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గోదావరి వరదల సమయంలో ఏటిగట్టు వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 2022లో ఇసుక బస్తాలు వేసి ఏటిగట్టు వద్ద తాత్కాలిక చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదం తప్పింది. లేదంటే ఇక్కడ గండి పడేది. ఈ పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– యర్రంశెట్టి గణేష్, పాశర్లపూడి

సమస్య లేకుండా చర్యలు

2022 గోదావరి వరదల్లో ఏటిగట్టు పొర్లి ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో ఎర్త్ వర్క్ చేపట్టేందుకు రూ.96 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మానేపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడి లంక ప్రాంతాల్లో ఏటిగట్టు రక్షణ పనులు చేపడతాం. ఈ పనుల నిర్వహణకు టెండర్ ఓకే అయ్యింది. త్వరలో పనులు మొదలు పెడతాం. వరదల నాటికి ఏవిధమైన సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

– టీవీఎల్ఎన్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

పార్టీ శ్రేణులను అభిమానంతో ఆదరిద్దాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను కో ఆర్డినేటర్లు అభిమానంతో ఆదరించి వారి మనసును గెలవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పోతవరంలో పార్టీ నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ స్థలంలో కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. గత 12 ఏళ్లుగా మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలు అందించిన నక్కా వెంకటేశ్వరరావును జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, జక్కంపూడి తాతాజీ, వాసంశెట్టి తాతాజీ, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, మట్టపర్తి పండు, దొమ్మేటి సత్యమోహన్, ముత్తాబత్తుల మణిరత్నం, దాసరి మౌనిక, ఎం.ప్రశాంత్, తోరం భాస్కర్, మిండగుదిటి శిరీష్, కుసుమ శ్రీధర్, నెల్లి దుర్గాప్రసాద్, ఎంఎం శెట్టి, రామారావు, యడ్ల పండు, దేశిరాజు సీతారామయ్య, జక్కంపూడి వాసు, కె.బాబీ, తోరం గౌతమ్, జల్లి శ్రీను, దాసరి కాశీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో హ్యాండ్ వాష్ యూనిట్

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన హ్యాండ్ వాష్ యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. కళాశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన హ్యాండ్ వాష్ యూనిట్‌ను దాతలు పోతంశెట్టి కనికిరెడ్డి, కొవ్వూరి నరేష్ కుమార్‌రెడ్డి, జక్కంపూడి రామకృష్ణ తదితరులు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ యూనిట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పెచ్చెట్టి చిన్నారావు, తేతలి విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో హ్యాండ్ వాష్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దాతలు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



ఆసుపత్రిలో బాధితుడు సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వానపల్లి గ్రామంలో గృహ నిర్మాణం సందర్భంగా తలెత్తిన వివాదంలో తాపీమేస్త్రీ బసవ నాగవెంకట సత్యనారాయణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పోలీసు అధికారులను కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను బుధవారం రాత్రి ఆయన పరామర్శించారు. ఆయనకు బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. వానపల్లిలో ఒగ్గు సాయిబాబు తన ఇంటిపై మరో ఫ్లోర్ నిర్మాణంలో భాగంగా కింద భాగం మాదిరిగానే కిటికీ పెట్టుకోగా సరిహద్దుదారుడు బండారు పళ్లంరాజుతో పాటు అతని సోదరులు, కుమారులు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు నిలిపివేశారు. పోలీసులకు ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇదిలా ఉండగా బుధవారం పళ్లంరాజు తదితరులు తాపీమేస్త్రి సత్యనారాయణ ఇంటికి వెళ్లి కిటికీ తొలగించాలని, లేకుంటే నిన్ను చంపేస్తామని బెదిరించారు. దానితో స్థానికుడు మద్దింశెట్టి వెర్రియ్యకు ఈ విషయం తెలిపి, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సత్యనారాయణ బయలు దేరారు. వెర్రియ్య మోటార్ సైకిల్ నడుపుతుండగా వెనుక సత్యనారాయణ కూర్చున్నారు. వానపల్లి రంగా సెంటర్‌లో వారిని అడ్డుకుని సత్యనారాయణను తీవ్రంగా గాయపరిచారు. దానితో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని జగ్గిరెడ్డికి బాధితుడు వివరించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని జగ్గిరెడ్డి డీఎస్పీ సుంకర మురళీమోహన్‌ను కోరారు.

సంప్రదాయ క్రీడలతో స్నేహ సంబంధాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్ విజేత టీమ్‌కు ట్రోఫీ, నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: సంప్రదాయ క్రీడా పోటీలు ఆయా ప్రాంతాలు, క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపరుస్తాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 20 రోజుల పాటు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్, విజేత టీమ్‌లకు బహుమతుల ప్రదానోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. దీనిలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడా పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో జరగాలని, జయాపజయాలను ఆయా టీమ్‌లు క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్‌రాజ్, విన్నర్, రన్నర్ టీమ్‌లను జగ్గిరెడ్డి అభినందించారు. విజేతగా నిలిచిన కొత్తపేట టీమ్‌కు రూ.70 వేలు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన మండపేట టీమ్‌కు రూ.30 వేలను జగ్గిరెడ్డి తన వ్యక్తిగతంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, నాయకుడు కర్రి నాగిరెడ్డి, సర్పంచ్ రెడ్డి చంటి, రావులపాలెం యువజన విభాగం అధ్యక్షుడు జవ్వాది రవి, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: విదేశాల్లో ఉంటూ స్వగ్రామాల్లో పేదలకు ఆదుకోవడానికి గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ (ఎన్నారై) ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం ఉయ్యూరువారి మెరక కమ్యూనిటీ హాల్ వద్ద ఇరువురు బాధిత కుటుంబాలకు ఫౌండేషన్ సమకూర్చిన రూ.20 వేలను గొల్లపల్లి పంపిణీ చేశారు. ఇందులో మే 31న ఉయ్యూరువారి మెరక ప్రగతి నగర్‌లో దింపు తీస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కార్మికుడు బూసి రాజ్ కుమార్ కుటుంబానికి రూ.10 వేలు, లక్కవరంలో పెరాలసిస్‌తో బాధపడుతున్న ముస్కూడి పెద్దిరాజు కుటుంబానికి రూ.10 వేలు అందించారు. కాగా నగదు సమకూర్చిన ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు గంటా శేఖర్‌కు గొల్లపల్లి అభినందనలు తెలిపారు. సర్పంచ్‌లు ఓగూరి రత్నకుమారి, గెడ్డం రాజ్యలక్ష్మి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కరరావు, నాయకులు పాటి శివకుమార్, ఓగూరి బాబులు, తాడి సహదేవ్, ఇనుమర్తి నాగరాజు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



జొన్నాడలో శ్రీపురంధరదాసుల శిక్షణలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆలమూరు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీపురంధరదాసుల సంకీర్తనల శిక్షణ తరగతులు జొన్నాడలో బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలమూరులోని అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకుడు ఎం.ముకేందరస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి టీటీడీకి చెందిన దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ తరగతులను ప్రారంభించారు. స్థానిక చిన వెంకన్న కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొత్తపేట, మండపేట నియోజకవర్గాలకు చెందిన హరే శ్రీనివాస భక్త బృంద సభ్యులు విచ్చేశారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీజనార్దన భజన మండలి, శ్రీబాల గోపాల భజన మండలి ఆలపించిన కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ఆలమూరు: రౌడీ షీటర్లు, నేరస్తులతో స్నేహం చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ యువతను హెచ్చరించారు. సంధిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తోట భవానీ అధ్యక్షతన బుధవారం రాత్రి డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలన్నారు. అసాంఘిక శక్తులతో తిరిగి పోలీసు కేసుల్లో ఇరుక్కోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు గ్రామాల్లోని యువత రౌడీ షీటర్లను ఆదర్శంగా తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ఎంపీటీసీ సభ్యుడు తోలేటి సంతోషి, దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, తోట వెంకటేశ్వర్లు, తోలేటి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఘటన దురదృష్టకరం

ఆలమూరులో ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రిమాండ్‌కు వెళ్లడం దురదృష్టకరమని సీఐ విద్యాసాగర్ వ్యాఖ్యానించారు. యువత ఒకసారి పోలీసు కేసు ఎదుర్కొంటే జీవితం పూర్తిగా నాశనం అవుతుందన్న విషయం గ్రహించాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కుదరని సయోధ్య

అంబాజీపేట: మండల టీడీపీ కమిటీ ఎంపికను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తామని పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తెలిపారు. మండల పార్టీ కమిటీ ఎన్నికను స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించారు. బీసీ సామాజిక వర్గంలోని శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించిన మండల అధ్యక్ష పదవికి పోటీ చేసే వారు ముందుకు రావాలని సుబ్రహ్మణ్యం సూచించారు. దీంతో మండల ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, మట్టపర్తి చంద్రశేఖర్ పోటీ చేస్తామంటూ ముందుకు వచ్చారు. దీనిపై సయోధ్యకు రావాలని సూచించినా కుదరలేదు. చివరికి రహస్య ఓటింగ్ పెట్టారు. ఫలితం అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

మామిడికుదురు: పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 232 మంది విద్యార్థులకు బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సుందర నీడి చిన్ని, ఎంపీటీసీ సభ్యులు కొమ్ముల జంగమయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ముత్యాల బాబి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. హెచ్ఎం చక్రవర్తి, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహనతో అతిసారం అంతం

ఆలమూరు: వర్షాకాలంలో వచ్చే అతిసార వ్యాధిని అవగాహనతో అంతం చేద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ అధికారులు ఎన్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో అతిసార వ్యాధి నియంత్రణపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా అతిసార వ్యాధి తీవ్రతను వివరిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్య, ఆశ సిబ్బంది బుధవారం ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా పాల్గొన్నారు.

పుస్తక గొడౌన్ పరిశీలన



రావులపాలెంలో లైబ్రరీ పుస్తకాల గొడౌన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మమ్మీ

రావులపాలెం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో లైబ్రరీ పుస్తకాల గొడౌన్‌ను డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మమ్మీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 మండలాల పరిధిలోని 1,263 ప్రాథమిక పాఠశాలలు, 66 ప్రాథమికోన్నత, 193 సెకండరీ, 50 సీనియర్ సెకండరీ పాఠశాలలకు 1,83,647 లైబ్రరీ పుస్తకాలు జిల్లాకు చేరాయన్నారు. ఈ పుస్తకాలను ఒకటి రెండు రోజుల్లో మండల కేంద్రాలకు తరలించనున్నట్లు ఆమె తెలిపారు. సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు మాట్లాడుతూ లైబ్రరీ పుస్తకాలను మండలాల వారీగా విభజన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, మండల విద్యాశాఖాధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, సీఆర్ఎంటీలు నాగరాజు, రాజేంద్రప్రసాద్, రాజబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీతికథల పుస్తకాలు ఇవ్వాలని వినతి

రాజోలు: కడలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ రాజోలు శాఖ గ్రంథాలయాధికారి కె.పద్మజకు బుధవారం పాఠశాల చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా తమ పాఠశాల విద్యార్థులకు అందించాలన్నారు. దేశ సంపద, వారసత్వం, జాతీయ నాయకుల గాథలు, పోటీపరీక్షల పుస్తకాలను గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో రెండు లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన పరగన సురేష్ వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం కొత్తపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

అధికార ప్రతినిధి కిషోర్‌కు సత్కారం



కిషోర్‌ను అభినందిస్తున్న రాజోలు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు

రాజోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధిగా నియమితులైన తెన్నేటి కిషోర్‌ను రాజోలు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం అభినందించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు అడబాల జానకీరామ్ ఆధ్వర్యంలో నాయకులు కిషోర్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. పార్టీలో కష్టించి పని చేసిన కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని, దానికి కిషోర్ నిదర్శనమని సర్పంచ్ రేవు జ్యోతి అన్నారు. ఎంపీటీసీ సభ్యులు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, వలంటీర్ విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు ఉచ్చుల దాసు, ప్రధాన కార్యదర్శి బొడ్డపల్లి ప్రసాద్, నార్ని మహాలక్ష్మి, కుక్కల మురళీకృష్ణ, రాయవలస ప్రసాద్, మంచిగంటి బోస్, గొల్లపల్లి ప్రసాద్, నల్లి శ్రీనివాస్, మొల్లేటి నాగరాజు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై అవగాహన



విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందించిన నిర్వాహకులు

రాజోలు: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్ మార్క్ సమావేశ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ప్రముఖ వక్త కొండిపర్తి ప్రదీప్ పాల్గొని ప్రసంగించారు. మండలంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు, ప్లేస్‌మెంట్ అంశాలు, ఇండస్ట్రీయల్ ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్స్ రూపకల్పన తదితర అంశాలను వివరించారు. ఎంసెట్ పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందించారు.

సర్పంచ్‌గా 'పెదపాటి' బాధ్యతల స్వీకరణ



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పెదపాటి సత్యనారాయణ

మలికిపురం: గూడపల్లి సర్పంచ్‌గా ఉప సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ సుందర తాతాజీ ఇటీవల మృతి చెందడంతో ఈ మేరకు సర్పంచ్ ఎన్నిక జరిగింది. పంచాయతీ కార్యదర్శి యడ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.